# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 229 | విశాఖపట్నం | 20-5-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 229 | VISAKHAPATNAM | 20-5-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay


# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది: చంద్రబాబు




**నెల్లూరు, పతాకం న్యూస్:** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. 'మన జలాల్లోకి వేటకి వస్తే వెంటాడతాం. మన రాష్ట్ర తీరంపై మనకే పూర్తి హక్కులు. ఇతర రాష్ట్రాల బోట్లు వస్తే శాటిలైట్‌తో గుర్తిస్తాం' అని సీఎం వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దు. సముద్ర సంపద పెంచుకోవాలి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులే' అని అన్నారు. చేపలు మంచి ప్రొటీన్ అని.. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019-24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారుల సాహసానికి సముద్రమే వేదికని సీఎం చంద్రబాబు అన్నారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచుతామని అలానే వీరి పిల్లలకు స్కిల్స్ నేర్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై సంతృప్తి ఎక్కువగా ఉన్న జిల్లా నెల్లూరు జిల్లా అని కొనియాడారు. మట్నదటిసారి నెల్లూరు (తరువాయి 2వ పేజీలో)

## బందరులో పీతల హేచరీ ఏర్పాటు: మంత్రి కొల్లు



**మచిలీపట్నం, పతాకం న్యూస్:** మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని రకాలైన కార్యక్రమాలూ చేపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మత్స్యకారుల సేవ' కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా (తరువాయి 2వ పేజీలో)

## కుటుంబ సభ్యుల్లా మత్స్యకారులు టీడీపీతో ఉన్నారు: అచ్చెన్నాయుడు



**నెల్లూరు, పతాకం న్యూస్:** టీడీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీకి, ఎన్టీఆర్, చంద్రబాబుకి ఎన్నెన్నో కష్టాలు వచ్చాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మత్స్యకారులు కుటుంబ సభ్యుల్లా పార్టీతో ఉన్నారని తెలిపారు. టీడీపీ అబద్ధాలు చెప్పదని... ప్రచారాలు చేసుకోదన్నారు. ప్రజలకు ఏమి కావాలో అదే చేస్తుందని స్పష్టం చేశారు. 2014 - 2019 రాష్ట్రానికి, మత్స్యకారులకి స్వర్ణయుగమన్నారు. 2019 ఎన్నికల్లో ఓ దుర్మార్గుడి మాయ మాటలు నమ్మామని.. కులాల్లో చిచ్చుపెట్టారని అన్నారు. చిన్న ఏమర పాటుతో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని విమర్శించారు. ప్రపంచంలో ఏపీని అసహ్యించుకునేలా చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక.. పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఎవరు చేశారో ఆలోచించాలన్నారు. వైసీపీ పేరు, ఆ నాయకుడి పేరు చెప్పనని... అవి చెబితే దరిద్రం చుట్టుకుంటుందంటూ వ్యాఖ్యానించారు. ఆ ఐదేళ్లలో ఏ సబ్సిడీలు ఇచ్చారో చెప్పాలని ఛాలెంజ్ విసిరారు.



3లో

జీవీఎంసీలో 98 నుంచి 120కి వార్డుల పెంపు.. ముసాయిదా విడుదల..



5లో

రైతుల నెత్తిన ఎరువు ధరల భారం..



6లో

కిడ్నీ వ్యాధులు ఉన్న వారు ఏ పండ్లను తినాలి.. వేటిని తినకూడదు..?

## వీధి కుక్కల తొలగింపు ఉత్తర్వుల సవరణకు సుప్రీంకోర్టు నిరాకరణ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా కుక్కకాటు ఘటనలు ఆందోళనకరంగా పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, క్రీడా సముదాయాలు, బస్ డిపోలు, రైల్వేస్టేషన్లు సహా రద్దీగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను తొలగించాలని గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఈ మేరకు గత ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన అన్ని దరఖాస్తులను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా (తరువాయి 2వ పేజీలో)



విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలొచ్చు: స్టాలిన్

2లో

## నేడు దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బంద్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా ఈనెల 20న మెడికల్ షాపులు బంద్ కానున్నాయి. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఎఐఒసిడి) పిలుపు మేరకు 20న బంద్ పాటించనున్నట్లు పేర్కొన్నాయి. సుమారు 15 లక్షలకు పైగా కెమిస్టులు, డ్రగ్గిస్టులు ఈ బంద్ లో పాల్గొననున్నారు. ఆన్ లైన్ లో మందుల విక్రయాలను నిలిపివేయాలని, కార్పోరేట్ సంస్థల అధిక డిస్కౌంటలను నియంత్రించి నకిలీ మందుల అమ్మకాలను నివారించాలనే డిమాండ్ల సాధన కోసం బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కొవిడ్ మహమ్మారి సమయంలో ఆన్ లైన్ లో మందుల విక్రయాలకు కేంద్రం అనుమతించిందని, కానీ ఏళ్లు గడిచినా నోటిఫికేషన్ ను వెనక్కు తీసుకోలేదని ఎఐఒసిడి అధ్యక్షుడు జగన్నాథ్ షిండే సోమవారం మీడియా సమావేశంలో తెలిపారు. ఆన్‌లైన్ కంపెనీలు ఈ సడలింపులను దుర్వినియోగం చేస్తూ, 20 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్లు ఇవ్వడంతో అనైతిక పోటీ నెలకొందని అన్నారు. ఈ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆర్థిక తుపాన్ రాబోతోంది: రాహుల్ గాంధీ



**రాయబరేలి, పతాకం న్యూస్:** ఐదు రోజుల్లో రెండు సార్లు ఇంధనం ధరలు పెరగడంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో త్వరలో ఆర్థిక తుపాన్ రాబోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలే ఈ దుస్థితికి కారణమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సృష్టించిన ఆర్థిక వ్యవస్థ కుప్పకూలనుందని, సాధారణ ప్రజానీకంపై ఇది పెనుభారం కానుందని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన రాహుల్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ, బిలియనీర్లు, పారిశ్రామికవేత్తల కోసం ప్రభుత్వ (తరువాయి 3వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# 'ఆక్వా' రైతుల కష్టాలు..

ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్య మవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడుతోంది. తన పరిధిలోని సమస్యల పరిష్కారాని క్కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మోదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది ఎ.పి.లోని రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20-30 శాతం పడిపో యాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం మనగలగడానికి ఆక్సిజన్ ఇస్తున్న టిడిపి గట్టిగా కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. శనివారం సర్కార్ నిర్వహించిన ఉమ్మడి సమావేశంలో కిలోకు రూ.31 వరకు పెంచాలని కంపెనీలు డిమాండ్ చేశాయి. రైతులు ససేమిరా అంగీకరించలేదు. బంతి సిఎం కోర్టుకు చేరింది. రాష్ట్ర విభజన తర్వాత ఆక్వా, అందులోనూ రొయ్యల సాగు విస్తరణకు టిడిపి, వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలతో అధిక ప్రాధాన్యమిచ్చాయి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. ఆక్వా రైతు శ్రేయస్సు దృష్ట్యా మోడీ సర్కార్ అమెరికాపై ఒత్తిడి తెచ్చి సుంకాలు తగ్గించాలి. పెట్రో ఛార్జీలు తగ్గించాలి. అందుకు టిడిపి కూటమి సర్కార్ కేంద్రంపై ఒత్తిడి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాలి.

## జగన్‌పై షర్మిల సెటైర్లు




**అమరావతి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. ఈరోజు (మంగళవారం) విజయవాడ వేదికగా షర్మిల మీడియాతో మాట్లాడారు. నేటికి వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ప్రజలకు అపారమైన అభిమానం, ప్రేమ ఉన్నాయని వ్యాఖ్యానించారు. భూతద్దం పెట్టి వెతికినా వైఎస్ లాంటి వారు పుట్టరని చెప్పుకొచ్చారు. వైఎస్ పేరు చెప్పుకుని జగన్ ఒక్క ఛాన్స్ అంటూ పాదయాత్ర చేశారని షర్మిల అన్నారు. ఆయన సీఎం అయ్యాక స్విచ్‌లు నొక్కడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం స్విచ్‌లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు అవరనేది కొంతమంది తెలుసుకోవాలని హితవు పలికారు. ఈ మధ్య నాయకులు సీఎం అవగానే ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్ రెండోసారి సీఎం అయ్యాక ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయించారని.. ఈ క్రమంలో రచ్చబండకు వెళ్తుండగా చనిపోయారని ప్రస్తావించారు. తండ్రి ఆశయాలను సాధిస్తామని చెప్పి.. ఓట్లు వేయించుకున్న వారు.. ఆ తర్వాత ఆయన ఆశయాలనే నాశనం చేశారని షర్మిల దుయ్యబట్టారు. నిన్న సిగ్గులేకుండా వైసీపీ నేతలు ధర్నాలు చేశారని సెటైర్లు గుప్పించారు. వాళ్ల ప్రభుత్వంలో భారాలు మోపిన విషయాలు మరిచారా..? అని ప్రశ్నించారు. జగన్ సీఎం అయ్యాక కూడా ప్రధాని మోదీ చెప్పినట్లుగా తల ఆడించారని విమర్శించారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల ఎద్దేవా చేశారు.

## విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలొచ్చు: స్టాలిన్



**తమిళనాడు, పతాకం న్యూస్:** డీఎంకేలోని సీనియర్ నేతలు కూడా విజయ్ ప్రభుత్వం ఎక్కువ కాలం అధికారంలో ఉండదని అంటున్నారు. డీఎంకే పార్టీ సీనియర్ నేత, తిరుచెందూర్ ఎమ్మెల్యే అనిత రాధాకృష్ణన్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. విజయ్ ప్రభుత్వం నాలుగు లేదా ఆరు నెలల్లో కుప్పకూలుతుందని అన్నారు. మళ్లీ ఎంకే స్టాలిన్ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలిచింది. విజయ్ రెండు స్థానాల్లో విజయం సాధించటంతో.. ఓ స్థానానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం టీవీకే ఎమ్మెల్యేల సంఖ్య 107 మాత్రమే. వీసీకే, సీపీఐ, సీపీఎమ్, ఐయూఎమ్ఎల్, కాంగ్రెస్ మద్దతుతో కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 25 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు విజయ్‌కి తమ మద్దతు తెలిపారు. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు విజయ్ వైపు వెళ్లినా లాభం లేకపోవచ్చు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని స్పీకర్ లేదా కోర్టు ఎప్పుడైనా వారిని డిస్ క్వాలిఫై చేసే అవకాశం ఉంటుంది. కాబట్టి కూటమిలోని పార్టీలే విజయ్ ప్రభుత్వానికి దిక్కు. డీఎంకే పార్టీ కూటమిలో ఏ చిన్న కలకలం సృష్టించినా ప్రభుత్వం కుప్పకూలిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం కూటమిలో ఉన్న వీసీకే పార్టీ డీఎంకే నేతృత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమిలో భాగస్వామిగా ఉంది. టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌కు దగ్గరగా ఉన్నప్పుడు.. వీసీకే పార్టీ టీవీకేకు మద్దతు ప్రకటించింది. టీవీకేకు మద్దతు ఇచ్చినంత మాత్రాన తాము డీఎంకే కూటమిని వీడినట్లు కాదని, తమ పొత్తు కొనసాగుతుందని వీసీకే స్పష్టం చేసింది. వీసీకే సాయంతో విజయ్ ప్రభుత్వాన్ని డీఎంకే ఎప్పుడైనా కూల్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కృష్ణా నదిలో బోట్లతో మత్స్యకారుల ర్యాలీ



**విజయవాడ, పతాకం న్యూస్:** కృష్ణా నదిలో మత్స్యకారులు బోట్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జాలరులంతా బోట్ల ప్రదర్శన చేశారు. వరుసగా రెండో ఏడాది 'మత్స్యకారుల సేవలో' పథకం కింద నిధులను విడుదల చేయడంపై మత్స్యకార కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. తమ సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కృష్ణా నదిలో బోట్ల ర్యాలీతో మత్స్యకారులు ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. వేట నిషేధ సమయంలో ఇబ్బందిపడకుండా ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోంది. గత ఏడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందచేయగా, ఈ ఏడాది 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

## భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి



**తిరుపతతి, పతాకం న్యూస్:** తిరుమలలో ప్రమాదవశాత్తూ మూడంతస్తుల భవనం పై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. అవధూత దత్తపీఠం వద్ద వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేస్తుండగా.. ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తమిళనాడులోని తిరుపత్తూర్ వనియంబాడికి చెందిన మణికంఠన్ (35) గా గుర్తించారు. ఘటనపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లులు హైపర్ మార్కెట్లో అధికారుల తనిఖీలు.. 150 కిలోల ఆహార పదార్థాల సీజ్




**హైదరాబాద్, పతాకం న్యూస్:** నగరంలో కూకట్‌పల్లిలోని లులు హైపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా ఉన్న దాదాపు 150 కిలోల ఆహార పదార్థాలను వారు సీజ్ చేశారు. మంగళవారం ఈ హైపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టిన అధికారు లకు.. పలు ఆహార పదార్థాల్లో పురుగులు ఉండటాన్ని గుర్తించారు. అలాగే నాసిరకం ఆహార పదార్థాలు నిల్వ చేసినట్లు కనుగొన్నారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని అధికారులు గుర్తించారు. పాడై పోయిన కూరగాయలతోపాటు పరిసర ప్రాంతాలలో పురుగులు సంచరిస్తున్నట్లు ఈ తనిఖీల్లో అధికారులు గమనించారు. గడువు సమీపించిన ఆహార పదార్థాలపై తప్పుదారి పట్టించే విధంగా లేబుళ్లు అతికించినట్లు గుర్తించారు. గడువు ముగిసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్‌తో ప్యాక్డ్ ఫుడ్ విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ హైపర్ మార్కెట్ నుంచి బయటకు వెళ్లే డ్రైనేజ్ కూడా మాంసాహార వ్యర్థాలతో మూసుకుపోయినట్లు ఈ తనిఖీల్లో తేలింది. కల్తీ, అధిక కృత్రిమ రంగుల అనుమానంతో పలు ఆహార పదార్థాల నమూనాలను కూడా అధికారులు సేకరించారు.

## మహిళా లాయర్‌పై సామూహిక అత్యాచారం

**పుణే, పతాకం న్యూస్:** దేశంలో మహిళల రక్షణను, ముఖ్యంగా చట్టాన్ని రక్షించే వృత్తిలో ఉన్న వారి భద్రతను సైతం ప్రశ్నించేలా మహారాష్ట్రలోని పుణే నగరంలో అత్యంత దారుణమైన, దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగుచూసింది. మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమైన వ్యక్తిని కలిసేందుకు వెళ్లిన ఒక మహిళా లాయర్‌పై... కదులుతున్న కారులోనే పైశాచికంగా సామూహిక లైంగిక దాడికి ఒడిగట్టారు. ఈ ఘోరానికి సంబంధించి పుణే పోలీసులు వేగంగా స్పందించి ఇప్పటికే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## అండగా ఉంటుంది: చంద్రబాబు

జిల్లాలో 2 పంటలకు నీళ్లు ఇచ్చామని గుర్తు చేశారు. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే డబ్బులని, మగవాళ్లు వేటకు వెళ్తే మహిళలు సీవీడ్ పండించాలని సూచించారు. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా పాటించాలని అన్నారు. మత్స్యకారుల పిల్లల జీవితాలు మెరుగుపడాలని అలానే మీ జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని వెల్లడించారు. "సముద్రంలో వేట నిలిచిపోతే పూట గడిచే పరిస్థితి లేదు. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. మత్స్యకారులు ఎన్నో రోజులు సముద్రంలోనే గడుపుతారు. తుపాను వస్తే కుటుంబసభ్యులకు సమాచారం కూడా ఇవ్వలేని పరిస్థితి. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. సముద్రంలో చేపల వేట చాలా కష్టమైన పని. చేపల వేటకు ఎంతో ధైర్యం కావాలి. ఉవ్వెత్తున ఎగిసిపడే అలలకు సైతం ఎదురెళ్లే గుండె ధైర్యం కావాలి. జీవనోపాధి కోసం కుటుంబాలను వదిలి రోజులతరబడి వెళ్తారు." చంద్రబాబు తెలియజేశారు. జువ్వలదిన్నెలో అత్యాధునిక షిప్పింగ్ హార్బర్ వచ్చిందని రూ.288 కోట్లలో దీని నిర్మాణం జరుగుతోందని సీఎం తెలిపారు. ఇప్పటికే 87 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ హార్బర్ మీ సొంతం ఫేక్ ప్రచారాలు నమ్మొద్దని చెప్పారు. సముద్ర సంపద ఉపయోగించుకోవాలని కోరారు. మన తీరంపై మనకే హక్కులు ఉంటాయని పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదని అన్నారు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుందని అప్పుడు వెంటనే అప్రమత్తమై ఎవరినీ రానివ్వమని చెప్పారు. 200 మెకనైజ్డ్ బోట్లు శాంక్షన్‌కు సిద్ధంగా ఉన్నాయని 60 శాతం సబ్సిడీతో ఇస్తాం సీఎం వెల్లడించారు. 2014-19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18 శాతం పెరిగిందని ఆ తర్వాత వైఎస్సార్సీపీ హయాంలో 2019-24 మధ్య 4 రెట్లు పడిపోయిందని సీఎం తెలిపారు. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించామని ఇవాళ 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థికసాయం అందించామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## ఏర్పాటు: మంత్రి కొల్లు

హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల్లో ఎక్కడా లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేట నిషేధ భృతిని మత్స్యకారులకు తొలిసారిగా ప్రకటించింది సీఎం చంద్రబాబు నాయుడే అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తొలుత బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటు డీజిల్ సబ్సిడీ కోసం నాడు నడకుదిటి నరసింహారావు కృషి చేశారని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఏకంగా రూ. 20 వేలకు పెంచామని కొల్లు రవీంద్ర వివరించారు. తనకు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసునన్నారు. రూ.4,000తో ప్రారంభించిన వేట నిషేధ భృతిని రూ.20 వేల వరకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రూ.260 కోట్లు మత్స్యకార భరోసా పథకంతో మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. మత్స్యకారుల జీవితాలను నాశనం చేసేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి జీవో నెం.217 తీసుకొస్తే.. దానిని కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని తెలిపారు. కృష్ణా జిల్లాలో 18 వేల మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని అందించామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరించారు. డీప్ సీ బోట్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు కేటాయించినా.. ఇక్కడ సదుపాయాలు లేవన్నారు. సీ వీడ్ (సముద్రపు నాచు) పండించడం ద్వారా కూడా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రూ.75 లక్షల వ్యయంతో పీతల హేచరీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. మత్స్యకారులు 250 బోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు చెప్పడం హర్షణీయం అన్నారు. మత్స్యకారులను ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు.

## వీధి కుక్కల తొలగింపు ఉత్తర్వుల సవరణకు సుప్రీంకోర్టు నిరాకరణ

జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. అలాగే, యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుబిఐ) రూపొందించిన 2025 ప్రామాణిక కార్యాచరణ విధానానికి (ఎస్ఒపి ) వ్యతిరేకంగా దాఖలైన సవాళ్లను కూడా కోర్టు తిరస్కరించింది. వీధికుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్స చేసిన తర్వాత వాటిని తిరిగి వీధుల్లోకి వదలకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. గౌరవప్రదంగా జీవించే హక్కులో, కుక్క కాటు లేకుండా స్వేచ్ఛగా జీవించే హక్కు కూడా భాగమేనని కోర్టు పేర్కొంది. ఇలాంటి తీవ్రమైన అంశంలో ప్రభుత్వం మౌన ప్రేక్షకులుగా ఉండకూడదని ధర్మాసనం గట్టిగా వ్యాఖ్యానించింది. జంతువుల పట్ల క్రూరత్వ నివారణ చట్టం, 1960 కింద రూపొందించిన జంతు జనన నియంత్రణ (ఎబిసి) నిబంధనలు, 2023కి అనుగుణంగా, కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, టీకాలు వేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వాల వైపు నుండి స్పష్టమైన ప్రయత్న లోపం కనిపిస్తోందని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. మానవ ప్రాణాలకు పొంచి ఉన్న ముప్పును తగ్గించడానికి, చట్టబద్ధంగా అనుమతించబడిన అన్ని చర్యలను తీసుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఇందులో భాగంగా "రేబిస్ సోకిన మరియు తీవ్ర ప్రమాదకరమైన కుక్కల విషయంలో కారుణ్య మరణం అమలు చేయవచ్చని ధర్మాసనం ఆదేశించింది.

# జలమండలి జీఎం ఇంట్లో ఏసీబీ సోదాలు.. రూ.100 కోట్ల ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ జలమండలి జనరల్ మేనేజర్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఈ తనిఖీలు జరుగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి.. హైదరాబాద్‌తో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. మల్లాపూర్‌లోని కుమార్ ఇంట్లో ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో తనిఖీలు జరుగుతున్నాయి. జీఎం కుమార్ బంధువుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. ఈ తనిఖీల్లో భారీగా నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కుప్పలుగా ఉన్న నోట్ల కట్టలు చూసి అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఇంట్లో ఎక్కడ చూసినా నోట్ల కట్టలే దర్శనమివ్వడంతో.. ఆ నగదు లెక్కింపునకు కౌంటింగ్ మెషీన్లను అధికారులు వినియోగిస్తున్నారు. దాదాపు రూ.1.20 కోట్ల నగదు,1.5 కిలోల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్‌లో 3 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో మూడు ఫ్లాట్‌లు, 6 ఓపెన్ ప్లాట్‌లను అధికారులు గుర్తించారు. బ్యాంకు లాకర్లను ఓపెన్ చేసి మరిన్ని ఆస్తులను గుర్తించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు. మల్లాపూర్‌లోని కుమార్ నివాసంలో 2 కార్లను సీజ్ చేశారు. మార్కెట్ విలువ ప్రకారం ప్రాథమికంగా 100 కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. గత నెలలో తన కుమార్తె వివాహాన్ని కుమార్ అంగరంగ వైభవంగా ఎంతో డబ్బులు వెచ్చించి మరీ జరిపించాడు. వివాహం కోసం కొన్ని వందల కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఆ డబ్బులు ఎలా సంపాదించారనే దానిపై కుమార్ వద్ద నుంచి ఏసీబీ అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## జీవీఎంసీలో 98 నుంచి 120కి వార్డుల పెంపు.. ముసాయిదా విడుదల..



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిని 120 వార్డులుగా విభజిస్తూ తయారుచేసిన ముసాయిదాను కమిషనర్ కేతన్‌గార్గ్ విడుదల చేశారు. ఆయా వార్డుల సరిహద్దులతో కూడిన ముసాయిదా, మ్యాప్‌లను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని జోనల్, తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా జీవీఎంసీ వెబ్‌సైట్‌లో ముసాయిదా, వార్డుల వారీగా మ్యాప్‌లను పొందుపరిచారు. వీటిపై ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలను ఈనెల 25 వరకు అందజేయవచ్చునని కమిషనర్ కోరారు. జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో ఉత్తర జోన్‌లో అత్యధికంగా 20 వార్డులు ఉండగా, భీమిలి, అగనంపూడి జోన్‌ల పరిధిలో ఐదేసి వార్డులు మాత్రమే ఏర్పడ్డాయి. మధురవాడ జోన్‌లో ఏడు, తూర్పు జోన్‌లో 18, దక్షిణ జోన్‌లో 16, ఉత్తర జోన్‌లో 20, పశ్చిమ జోన్‌లో 17, గాజువాక జోన్‌లో 19, అగనంపూడిజోన్‌లో ఐదు, అనకాపల్లి జోన్‌లో ఆరు, పెందుర్తి జోన్‌లో ఏడు...ఇలా మొత్తం 120 వార్డులను విభజించారు.జీవీఎంసీ పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియను భీమిలి జోన్‌వైపు నుంచి ప్రారంభించారు. కొండపేట కాలనీ, గోస్తనీ నదికి ఆనుకుని ఉన్న వసంతవిహార్ లేఅవుట్, చిట్టివలస పరిసర ప్రాంతాలను ఒకటో వార్డుగా విభజించారు. ఇక మధురవాడ జోన్ పరిధిలో కంబాలకొండ రిజర్వు ఫారెస్ట్, అడవివరం జంక్షన్, సింహాచలం కొండ మీదుగా పాతగోశాల, ప్రహ్లాదపురం, సింహపురి లేఅవుట్ ఫేజ్-2, ఎర్రకొండ ఫారెస్ట్ ప్రాంతాలను 120వ వార్డుగా నిర్ణయిస్తూ విభజన ప్రక్రియను పూర్తిచేశారు. కాగా ముసాయిదా విడుదల చేసిన కొద్దిసేపటికే వార్డుల విభజనపై అభ్యంతరాలు ప్రారంభమయ్యాయి. వార్డుల సరిహద్దులు నిర్ణయించడానికి గెడ్డలు, రోడ్లు, రైల్వే ట్రాక్‌లను ప్రామాణికంగా తీసుకోకుండా ఎమ్మెల్యేలు చెప్పినట్టు చేశారంటూ సీపీఎం మాజీ కార్పొరేటర్ గంగారావు ఆరోపించారు. వార్డుల విభజన శాస్త్రీయంగా జరగలేదని, దీనిపై తాను లిఖితపూర్వకంగా తన అభ్యంతరాలను తెలియజేస్తానన్నారు. మధురవాడ జోన్‌లో పీఎం పాలెంలో పక్కనున్న కాలనీలను వదిలేసి ఎక్కడో ఉన్న ఎంవీవీసిటీని ఒక వార్డులో కలపడం విడ్డూరంగా ఉందని, మధురవాడ జోన్‌లో ఇష్టారాజ్యంగా జరిగిపిన వార్డుల విభజన ప్రక్రియలో లోపాలను సవరించాలని జనసేన పార్టీ నేత ఈఎన్ఎస్ చంద్రరావు డిమాండ్ చేశారు.

## అనకాపల్లి సీసీఎస్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా జిల్లా కేంద్రంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన రావు సమక్షంలో జరిగిన ఈ తనిఖీల్లో భాగంగా ఎస్పీ స్టేషన్ ఆవరణను పరిశీలించి, శాంతిభద్రతలు మరియు నేరాల నియంత్రణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డుల క్రమబద్ధీకరణపై సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ, అదనపు ఎస్పీ మార్గదర్శకత్వంలో సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో ఇళ్లు తాళాలు వేసి ఉండటం వల్ల చోరీలు జరిగే అవకాశం ఎక్కువ ఉన్నందున పాత నేరస్థులు (ఖణం), బ్యాడ్ క్యారెక్టర్స్ (దీజం) మరియు అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, 'ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్' సాంకేతికతను విరివిగా ఉపయోగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు నేతృత్వంలో సీసీఎస్ పోలీసులు, స్థానిక పోలీస్ స్టేషన్ల సిబ్బందితో కలిసి సంయుక్తంగా సాధించిన విజయాలను ఎస్పీకి వివరించారు.

## విశాఖలో క్రమంగా తగ్గుతున్న సర్వీస్‌లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సర్వీస్‌లు క్రమంగా తగ్గిపోతున్నాయి. పశ్చిమ ఆసియా దేశాల యుద్ధం వల్ల ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. పెరిగిన వ్యయాలకు అనుగుణంగా విమానాల టికెట్ ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించడం లేదు. దాంతో విమాన సంస్థలకు నష్టాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 85 శాతం కంటే తక్కువ ఆక్యుపెన్సీతో నడుస్తున్న మార్గాల్లో విమానాలు నిలిపివేయాలని ఆయా సంస్థలు ఆదేశిస్తున్నాయి. విశాఖపట్నంలో విమాన సర్వీసుల రద్దుకు మరో కారణం కూడా కనిపిస్తోంది. ఇక్కడికి సమీపానే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించారు. దానిని జూలై లేదా ఆగస్టులో ప్రారంభించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్కడ ఆపరేషన్లు మొదలైతే విశాఖపట్నంలో విమానాశ్రయం మూసివేయాలనే నిబంధన ఉంది. అందుకని విమాన సంస్థలు ముందుగానే తమ షెడ్యూళ్లను సవరించుకుంటున్నాయని విమానాశ్రయం వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం విశాఖపట్నం నుంచి కర్నూలుకు నడుస్తున్న విమానాన్ని జూన్ 30తో ఆపేస్తున్నామని ఆ సంస్థ పేర్కొంది. అలాగే విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు నడుస్తున్న విమానం కూడా జూన్ 12 తరువాత ఉండదని ఆయా వర్గాలు పేర్కొన్నాయి. విశాఖపట్నం నుంచి చెన్నైకి ప్రస్తుతం రోజుకు మూడు విమానాలు నడుస్తుండగా జూన్ నుంచి సెప్టెంబరు వరకు రోజుకు ఒకటి మాత్రమే, అది కూడా సాయంత్రం సమయంలోనే ఉంటుందని ఎయిర్ ట్రావెల్స్ సంస్థలు చెబుతున్నాయి. ఇకపోతే విశాఖ నుంచి కోల్‌కత్తాకు ప్రస్తుతం రోజూ ఒక విమానం నడుస్తోంది. దీనిని జూన్ ఒకటో తేదీ నుంచి వారానికి నాలుగు సార్లు మాత్రమే నడుపుతారని, మిగిలిన మూడు రోజులు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు.

## అనకాపల్లి- సికింద్రాబాద్ రైలు ప్రారంభం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ప్రయాణికుల సౌకర్యార్థం అనకాపల్లి నుంచి సికింద్రాబాద్‌కు సాయంత్రం వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలును అనకాపల్లి ఎంపీ, రైల్వే స్టాండింగ్ బోర్డు కమిటీ చైర్‌పర్సన్ సీఎం రమేశ్ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, కార్పొరేషన్ల చైర్మన్లు కూడా పచ్చజెండా ఊపారు. 17044 ఎక్స్‌ప్రెస్ నంబరు గల ఈ రైలు సోమవారం సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరింది. ఈ రైలు ఫస్ట్ ఏసీ ఒకటి, సెకండ్ ఏసీ నాలుగు, థర్డ్ ఏసీ 12 బోగీలతో ప్రారంభమైంది. ఇది ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమహేంద్రవరం, భీమవరం, ఆకివీడు, కైకలూరు, విజయవాడ, కృష్ణా చానల్ జంక్షన్, గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి, చర్లపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు మంగళవారం ఉదయం 8.40 గంటలకు చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, టీడీపీ విశాఖ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పొన్నగంటి అప్పారావుతో పాటు కూటమి నాయకులు, స్టేషన్ మేనేజర్ సచ్చి నివాస్ పాల్గొన్నారు.

## ఆర్థిక తుపాన్ రాబోతోంది.. రాహుల్ గాంధీ

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక విధానాల రూపకల్పన జరిగిందన్నారు. ఇది పూర్తిగా కుప్పకూలనుందని చెప్పారు. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపై ఆర్థిక సంక్షోభ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు. అయితే ఈ ప్రభావం అదానీ, అంబానీ, మోదీలపై ఏమాత్రం ఉండదన్నారు. మునుముందు అంతా ఇక గడ్డుకాలమేనని చెప్పారు. ఆర్థిక సంక్షోభ నివారణకు కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి బదులు విదేశాలకు వెళ్లొద్దని మోదీ చెబుతున్నారని, ఆయన మాత్రం ప్రపంచమంతా తిరుగుతుంటారని విమర్శించారు. 'బిలియనీర్ల కోసం మోదీ ఆర్థిక వ్యవస్థను తారుమారు చేశారు. గత కొన్ని రోజులుగా ఈ విషయమే ప్రజలకు నేను వివరిస్తున్నాను. ఇప్పుడు ఆర్థిక సంక్షోభం విరుచుకుపడనుంది. ఇందువల్ల కీలక పారిశ్రామికవేత్తలు, రాజకీయ నేతలపై ఎలాంటి ప్రభావం ఉండదు. వాళ్లు హాయిగా తామున్న చోటే ఉంటారు. కానీ యూపీలోని యువకులు, ప్రజలపై ఈ ఆర్థిక తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుంది' అని రాహుల్ అన్నారు.

## మండుతున్న ఎండలు..



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఎండ తీవ్రతకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లావాసులు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో వేడిగాలులకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంగళవారం నుంచి ఎండలు మరింత పెరిగి వడగాడ్పులు వీయనున్నాయి. మంగళవారం అనకాపల్లి జిల్లాలోని రెండు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 12 మండలాల్లో వడగాడ్పులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక మండలంలో తీవ్ర వడగాడ్పులు, ఐదు మండలాల్లో వడగాడ్పులు, విశాఖపట్నం జిల్లాలో ఒక మండలంలో వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పలుచోట్ల ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల వరకూ నమోదవుతాయని పేర్కొంది. ఇక బుధవారం అనకాపల్లి జిల్లాలో ఎనిమిది మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 16 మండలాల్లో వడగాడ్పులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐదు మండలాల్లో తీవ్రంగా, ఆరు మండలాల్లో వడగాడ్పులు, విశాఖపట్నం జిల్లాలో నాలుగు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, ఐదు మండలాల్లో వడగాడ్పులు వీయనున్నాయి. ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల వరకూ నమోదవుతాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గాడ్పులు వీయనున్నందున అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ఉపాధి కూలీలు, రైతులు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఉదయం పది గంటలకల్లా ఇళ్లకు చేరుకుని సాయంత్రం నాలుగు గంటల తరువాత బయటకు వెళ్లాలని సూచించింది. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తాగాలని ప్రజలకు సూచించింది.

## లంబసింగిలో తాగునీటి కష్టాలు




**చింతపల్లి, పతాకం న్యూస్:** పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందిన లంబసింగిలో ఆదివాసీలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో రక్షిత మంచినీటి పథకం పైపులైన్లు దెబ్బతిన్నాయి. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, జాతీయ రహదారుల అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. దీంతో నీళ్ల కోసం మూడు నెలలుగా మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లంబసింగిలో సుమారు 250 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామానికి లంబసింగి జంక్షన్, సంతబయలు వద్ద ఉన్న మంచినీటి పథకాల ద్వారా గతంలో నీటి సరఫరా జరిగేది. జాతీయ రహదారి నిర్మాణంలో లంబసింగి జంక్షన్ నుంచి లంబసింగి గ్రామానికి వచ్చే పైపులైన్లు, సంతబయలులో ఉన్న నీటి పథకం ద్వారా నీటి సరఫరా జరిగే పైపులైన్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. అలాగే సంత బయలు వద్దనున్న నీటి పథకం బోర్‌వెల్, మోటారు పనిచేయడం లేదు. దీంతో గ్రామస్థులు జాతీయ రహదారులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఆ శాఖల అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం చెరువులవేనం నుంచి లంబసింగికి ఏర్పాటు చేసిన గ్రావిటీ పథకం ద్వారా కొంత మేరకు నీటి సరఫరా జరుగుతున్నది. అయితే ఈ గ్రావిటీ పథకం నీరు పంచాయతీ కేంద్రం ప్రజలందరికి అందడంలేదు. గ్రామంలో ఇద్దరు, ముగ్గురు వ్యక్తిగత మంచినీటి బోర్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో స్థానిక గిరిజనులు వ్యక్తిగత బోర్లు ఉన్న కుటుంబాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటూ గత మూడు నెలలుగా నెట్టుకొస్తున్నారు. మంచినీటి సమస్యపై ఇప్పటికే మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు అర్జీలు అందజేసినప్పటికీ ఎవరు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి లంబసింగిలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## చోడవరంలో అన్న క్యాంటీన్ విశేష స్పందన



**చోడవరం, పతాకం న్యూస్:** : పేదల ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్థానిక అన్న క్యాంటీన్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. రోజూ 1,200 మంది ఆకలి తీరుస్తోంది. రోజువారీ కూలీలు, కార్మికులు, ఆటో డ్రైవర్లకు ఈ క్యాంటీన్ వరంలా పరిణమిస్తోంది. అనకాపల్లి, నర్సీపట్నం వంటి అర్బన్ ప్రాంతాలను మినహాయిస్తే గ్రామీణ ప్రాంతంలో మాడుగుల, పాయకరావుపేట, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ల కంటే చోడవరంలోని అన్న క్యాంటీన్‌కు ఆదరణ బాగుందని నిర్వాహకులు చెబుతున్నారు. స్థానికంగా గత నెల 15న ప్రారంభించిన అన్న క్యాంటీన్ రోజుకు 1,200 మంది కడుపు నింపుతున్నది. ఉదయం 500 మంది టిఫిన్లు చేస్తుండగా, మధ్యాహ్నం 700 మంది భోజనాలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న పేదలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోజువారీ కూలీలు, కార్మికులు, ఆటో డ్రైవర్లకు ఈ అన్న క్యాంటీన్ ఆకలి తీర్చే అన్నదాతగా మారింది. ఈ క్యాంటీన్ ఉదయం, మధ్యాహ్నం వేళలో నిత్యం రద్దీగా ఉంటోంది. ఉదయం అల్పాహారంగా ఇడ్లీతో పాటు సాంబారు, చట్నీ, పూరీ లేదా ఉప్మా పెడుతున్నారు. పూరీ లేకపోతే ఇడ్లీతో పాటు ఉప్మా, మరో రోజు పొంగల్ పెడుతున్నారు. మధ్యాహ్నం భోజనంలో కూర, సాంబారు, అన్నం, పచ్చడి, పెరుగుతో భోజనం పెడుతున్నారు. భోజనం నాణ్యతతో పాటు రుచిగా ఉండడంతో జనం ఆనందంగా ఆరగిస్తున్నారు.

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై సీఎం రేవంత్ కీలక సూచనలు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు.

జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ జోన్‌గా గిరిజన ప్రాంతం

### పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుకు ప్రణాళిక



**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన ప్రాంతాన్ని ఆర్గానిక్ జోన్‌గా తీర్చిదిద్దేందుకు పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహపరిశోధన సంచాలకులు(ఏడీఆర్) డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. రాష్ట్రంలో ఆర్గానిక్ ఉత్పత్తులు సాగు చేసేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా అనువైన ప్రాంతమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ గిరిజన ప్రాంతంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నదన్నారు. రైతులు గతంలో పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసేవారని, కాలక్రమేణా రసాయనిక ఎరువులు, పురుగు మందులకు ఆకర్షితులయ్యారు. ఈ సాగు విధానంలో మార్పు తీసుకొచ్చేందుకు ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం విశిష్ట కృషి చేస్తుందన్నారు. ఖరీఫ్, రబీలో పండించే పంటలు విత్తనం నాటినప్పటి నుంచి పంట కోసే వరకు సేంద్రీయ పద్ధతులను పాటించేందుకు శాస్త్రవేత్తలు పూర్తి సాంకేతిక సహకారం అందిస్తారన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులను దూరం చేసి, జీవ నియంత్రణ ఎరువులు, పురుగు మందులను రైతులకు పరిచయం చేయనున్నామని ఆయన చెప్పారు. అలాగే నూతనంగా నియమితులైన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పీవీ సత్యనారాయణ గిరిజనుల వ్యవసాయ ప్రగతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో కురుస్తున్న అధిక వర్షాలు, సహజ జలాలను సద్వినియోగం చేసుకుంటూ పండించేందుకు అనువైన పంటలు, సాగు విధానంపై అధ్యయనం చేసేందుకు ఉపకులపతి ఆదేశాలతో శాస్త్రవేత్తలు ప్రత్యేక ప్రాజెక్టు రూపకల్ప చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో వివిధ ప్రాంతాల్లో విభిన్న స్వభావం కలిగిన నేలలు ఉన్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఉన్న నేలలు, సాగుకు అనుకూలమైన పంటలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. వరిలో బ్లాక్ రైస్‌కి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. గిరిజన రైతులు ఆర్గానిక్ పద్ధతిలో బ్లాక్ రైస్ సాగు చేస్తే మంచి ధర లభిస్తుందన్నారు. గిరిజన ప్రాంతానికి అనువైన బ్లాక్ రైస్ బీపీటీ 2841 రకం విత్తనాలను అభ్యుదయ రైతులకు చిరు సంచుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. బ్లాక్ రైస్‌ని సేంద్రీయ పద్ధతిలో సాగు చేసేందుకు ప్రోత్సహిస్తామన్నారు. రానున్న మూడేళ్లలో గిరిజన ప్రాంతంలో బ్లాక్ రైస్ సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. బ్లాక్ రైస్ సాగు ద్వారా రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. గిరిజన ప్రాంత రైతులు కొర్ర, రాగి, సామ పంటల్లో దేశవాళీ వంగడాలను సాగు చేసుకుంటున్నారన్నారు. దీంతో రైతులు నాణ్యమైన అధిక దిగుబడులు పొందలేకపోతున్నారని తెలిపారు. ఈ మేరకు తాజాగా చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జరిగిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన, సలహా మండలి(జెడ్ఆర్ఈఏసీ) సమావేశంలో శాస్త్రవేత్తలు గిరిజన రైతులకు మేలిరకం వంగడాలను అందించాలని నిర్ణయించారన్నారు. రానున్న ఖరీఫ్‌లో ఐదేళ్లలోపు విడుదలైన విత్తనాలను రైతులకు మినీ కిట్స్ రూపంలో అందజేస్తామన్నారు. ప్రధానంగా రాగిలో పీఈఆర్ 1216, సామలో వీఎస్ 57 పంపిణీకి విశ్వవిద్యాలయం ఏర్పాట్లు చేస్తుందన్నారు. గిరిజన రైతులు వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల సహకారంతో వ్యవసాయ ప్రగతి సాధించాలని ఆయన సూచించారు.

## మళ్లీ పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు 90 పైసలు పెంపు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరిగాయి. లీటర్‌కు 90 పైసల చొప్పున పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. వారం రోజుల్లోనే ఇది రెండోసారి ధరల పెంపు కావడం గమనార్హం. మే 15న దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచారు. జాతీయ రాజధాని దిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.97.77 నుంచి రూ.98.64కు పెరిగింది. డీజిల్ ధర రూ.90.67 నుంచి రూ.91.58కు చేరింది. ముంబయిలో పెట్రోల్? ధర పెట్రోల్ ధర 91 పైసలు పెరిగి లీటరుకు రూ.107.59కు చేరింది. డీజిల్ ధర 94 పైసలు పెరిగి రూ.94.08గా నమోదైంది. కోల్‌కతాలో పెట్రోల్‌పై అత్యధికంగా 96 పైసల పెరుగుదల నమోదైంది. దీంతో ధర లీటరుకు రూ.109.70కు చేరింది. డీజిల్ ధర 94 పైసలు పెరిగి రూ.96.07 అయింది. ఇక చెన్నైలో పెట్రోల్ ధర 82 పైసలు పెరిగి రూ.104.49కు చేరగా, డీజిల్ ధర 86 పైసలు పెరిగి రూ.96.11గా నమోదైంది.

## జలుమూరులో ఆక్రమణల తొలగింపు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జలుమూరులో రోడ్డుకు ఇరువైపుల గల ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. వ్యాపారులు తమ ఇంటి ముందు ఉన్న డ్రైనేజీలను ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిస్తుండడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామానికి చెందిన కోలా తిరుపతిరావు, విశ్రాంతి ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారని, దీంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించినట్లు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైతే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జగదీష్, వీఆర్వోలు అర్జునరావు, రామారావులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో వార్డుల విభజన ముసాయిదా విడుదల



**నర్సీపట్నం, ఎలమంచిలి, పతాకం న్యూస్:** నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో ఆయా కమిషనర్లు వార్డుల విభజన ముసాయిదాను విడుదల చేశారు. నర్సీపట్నం పురపాలక సంఘం వార్డుల విభజన ముసాయిదా ప్రతులను కమిషనర్ జంపా సురేంద్ర విడుదల చేశారు. ప్రస్తుతం ఉన్న 28 వార్డులను 40 వార్డులకు పెంచుతూ సరిహద్దులతో సహా ప్రకటించారు. పురపాలక సంఘం కార్యాలయంలో ఉద్యోగులతో కలిసి ముసాయిదా ప్రతులు ప్రదర్శించారు. ముసాయిదా ప్రతులను సబ్ కలెక్టర్ కార్యాలయం, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, సచివాలయాల్లో ప్రదర్శించారు. దీనిపై ప్రజల నుంచి సూచనలు, అభ్యంతరాలు స్వీకరణకు ఏడు రోజులు గడువు ప్రకటించారు. మునిసిపాలిటీ వార్డుల పునర్విభజన జరగడం ఇది రెండో పర్యాయం. 2011లో నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, బలిఘట్టం పంచాయతీలను కలిపి 27 వార్డులతో నర్సీపట్నం మునిసిపాలిటీని ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో 2019-20లో 27 వార్డులను 28 వార్డులకు పెంచారు. తాజాగా 2011 జనాభా లెక్కల ప్రకారం 60 వేల నుంచి 80 వేలలోపు జనాభా కలిగిన మునిసిపాలిటీలలో 40 వార్డులకు పెంచాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గత నెలలో మునిసిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి, సచివాయ సిబ్బందితో కలిసి 28 వార్డులలో సర్వే చేపట్టారు. 40 వార్డుల విభజన సరిహద్దులతో పాటు మ్యాప్‌తో సహా సిద్ధం చేశారు. వార్డుల విభజన మీద సందేహాలు ఉంటే టౌన్ ప్లానింగ్ విభాగంలో నివృత్తి చేసుకోవాలని కమిషనర్ సురేంద్ర కోరారు. ఎలమంచిలి మునిసిపాలిటీలో జనాభా, ఓటర్ల ప్రాతిపదికన వార్డుల పునర్విభజన ముసాయిదాను మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు విడుదల చేశారు. ఎలమంచిలి మునిసిపల్ కార్యాలయ నోటీసు బోర్డులో ముసాయిదా ప్రతులను ఏర్పాటు చేశారు. అలాగే తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల నోటీసు బోర్డుల్లోనూ వీటిని ఏర్పాటు చేశారు. మునిసిపాలిటీలో ప్రస్తుతం ఉన్న వార్డుల సంఖ్యను 25 నుంచి 32 వార్డులకు పెంచుతూ ముసాయిదా విడుదల చేసినట్టు కమిషనర్ తెలిపారు. మునిసిపల్ కమిషనర్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది సర్వే చేసిన అనంతరం ముసాయిదా ప్రతిపాదన సిద్ధం చేశారు. వార్డుల పునర్విభజన విషయంలో ప్రజల అభ్యంతరాలు, సూచనలు, సలహాలను ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా అందజేయవచ్చు.

## గ్రామదేవతల పండగల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల



**పెందుర్తి, పతాకం న్యూస్:** పెందుర్తి నియోజకవర్గం పరిధిలో జీవీఎంసీ 94, 95 వార్డులలో పలు గ్రామాల్లో జరిగిన గ్రామ దేవతల పండుగ మహోత్సవాలలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. ముందుగా జీవీఎంసీ 95 వ వార్డు చీమలపల్లి శ్రీ రోళ్ళ పైడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ రోళ్ళ పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమేష్ బాబు గారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి ఆ గ్రామ ప్రజలు ఎన్డీఏ కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు అనంతరం జీవీఎంసీ 94 వ వార్డు బంటా కాలనీ గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి అమ్మవారిని మరియు జీవీఎంసీ 94 వ వార్డు కృష్ణరాయపురం సేనాతివానిపాలెం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ రోళ్ల పైడిమాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు బాగా పండి అన్నదాతలు సంతోషంగా ఉండాలని, యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలగాలని అమ్మవార్లను ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో 94 వార్డు మాజీ కార్పొరేటర్ బల్లా శ్రీనివాసరావు, కనీస వేతనాలు డైరెక్టర్ బర్రెడ్డి అప్పారావు ,ఏఎంసీ డైరెక్టర్స్ లక్కీ గోవింద్ ,హైమావతి , కోరుబిల్లి సంతోష్,సీనియర్ నాయకులు సానాతి దేవుడు, దాట్ల మధు , జగన్మోహన్ పాత్రుడు , గంట్ల దివాకర్ కంపర సత్తిబాబు , నీటిపల్లి మహేష్ అయితే శ్రీనివాసరావు ,కోటి బోయిన శ్రీనివాసరావు , ఎర్ర నాగరాజు, చల్లా రావు , ప్రజాశక్తి ఈశ్వరరావు, మోటూరు చైతన్య,జుత్తాడ శ్రీనివాసరావు ,తనకాల శ్రీనివాసరావు, కోరుకొండ వరహాలు, కోనా మోహన్ కుమార్, రాంబాబు గారు కర్రీ సంతోష్ తదితరులు జీవీఎంసీ 94,95వ వార్డుల ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ దేవతల అమ్మవార్లను దర్శించుకున్నారు.

## ఇంధనం ఆదా చేయాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ప్రధాని మోదీ పిలుపు మేరకు ఇంధన పొదుపు చేపట్టడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని నగర కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు అన్నారు. ఇంధన పొదుపుపై అవగాహన కలిగిం చేందుకు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ బృందంతో కలిసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. స్థానిక రామలక్ష్మణ కూడలి నుంచి నగర వీధుల్లో కమిషనర్ తదితరులు సైకిల్‌పై వెళ్లి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని పిలుపు మేరకు రాష్ట్రంలో ప్రజా ప్రతి నిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇంధన పొదుపు చర్యలు పాటిస్తు న్నారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పొదుపు చర్యలు పాటించాలని కోరారు. సైకిల్ తొక్కడం వల్ల ఇంధనం ఆదాతో పాటు శారీరకంగా ఆరోగ్యం సిద్ధిస్తుం దన్నారు. అలాగే గుండెపదిలంగా ఉంటుందని, నరాల బలహీనత, అధిక బరువును నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమం లో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు నటుకుల మోహన్, లక్ష్మణరావు, లోక్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎంపీ కలిశెట్టి



**రణస్థలం, పతాకం న్యూస్:** ప్రజా సమస్యలను తెలు సుకుని వాటిని పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటు న్నామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చిల్లపేట రాజాం గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను సం బంధిత అధికారులు పరిశీలించి రెండు వారాల్లో గా పరిష్కరించడం జరుగుతుందన్నారు. నారువ, సీహెచ్ రాజాంకు సీసీ రోడ్లు మంజూరు చేయా లని మాజీ సర్పంచ్ నిద్రబంగి రామకృష్ణ వినతి పత్రం అందించారు.

## కాకినాడలో అగ్నిప్రమాదం.. రూ 70 లక్షలు ఆస్తి నష్టం



**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడలోని మన్నూరులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో గల మసీదు కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పెయింట్ దుకాణంలో వెల్డింగ్ తో మరమ్మతులు చేస్తుండగా నిప్పు రవ్వలు ఎగిసి టిన్నర్ పై పడటంతో మంటలు చెలరేగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగడంతో అల్ అమిన్ ట్రేడర్స్ లో భారీ ఎత్తున మంటలు చెలరేగి పెయింట్ డబ్బాలతోపాటు సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ 70 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు పేర్కొన్నారు. అగ్ని ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాధితులను పరామర్శించారు. మానవ తప్పిదమా లేక, ఇతర ఏ కారణాల వలన ప్రమాదం జరిగిందో విచారణ జరిపిస్తామని, బాధితులను ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని జగన్మోహన్ రాజు భరోసా ఇచ్చారు.

## బండి భగీరథ్ కేసులో బిగుస్తున్న ఉచ్చు.. కీలకంగా మారిన స్నేహితుల వాంగ్మూలాలు



**అమరావతి, పతాకం న్యూస్:** సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసులో దర్యాప్తును పోలీసులు మరింత వేగవంతం చేశారు. ఈ కేసు విచారణలో భగీరథ్ స్నేహితుల వాంగ్మూలాలు అత్యంత కీలకంగా మారనున్నాయి. బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్న సంఘటనల సమయంలో భగీరథ్‌తో పాటు ఉన్న స్నేహితుల పాత్రపై పోలీసులు దృష్టి సారించారు. ఇప్పటికే ముగ్గురు యువతులు సహా దాదాపు పది మంది స్నేహితుల వాంగ్మూలాలను పోలీసులు నమోదు చేసినట్లు సమాచారం. సోమవారం కూడా ఇద్దరు యువకులు, ఒక యువతిని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు. గతేడాది అక్టోబర్ 25న నానక్‌రామ్‌గూడలోని ఓ అపార్ట్‌మెంట్‌కు, డిసెంబర్ 31న మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి మద్యం మత్తులో తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఆరోపించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌తో పాటు ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. భగీరథ్, బాధితురాలి మధ్య ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ ద్వారా పరిచయం పెరిగినందున, వారి సోషల్ మీడియా ఖాతాల్లోని డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను ఇప్పటికే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి కాల్ రికార్డులు, వాట్సాప్ చాట్‌లను విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను విచారించేందుకు ఏడు రోజుల కస్టడీ కోరుతూ పోలీసులు మంగళవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. కస్టడీలోకి తీసుకున్న తర్వాత, ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను ముందుపెట్టి లోతుగా ప్రశ్నించాలని భావిస్తున్నారు. ఈ కేసు తదుపరి విచారణ మొత్తం మల్కాజిగిరి పోక్సో కోర్టు పరిధిలో జరగనుంది. కేసు తీవ్రత దృష్ట్యా సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేయాలని పోలీసులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు.

## రౌడీషీటర్లతో రోడ్డుపై పరేడ్ చేయించిన పోలీసులు



**వరంగల్, పతాకం న్యూస్:** తెలంగాణలోని వరంగల్ జిల్లా కేంద్రంలో పోలీసులు రౌడీ షీటర్ల ఆట కట్టిస్తున్నారు. రౌడీ షీటర్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు రౌడీషీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. ఆ రౌడీ షీటర్లను ఖిల్లా వరంగల్ తహసీల్దారు కార్యాలయం వరకు రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకుపోయారు. అనంతరం తహసీల్దారు సమక్షంలో వారిని బైండోవర్ చేశారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం మొత్తం 764 మంది రౌడీ షీటర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఈస్ట్ జోన్ పరిధిలో 275, వెస్ట్ జోన్ పరిధిలో 158, సెంట్రల్ జోన్ పరిధిలో 331 మంది రౌడీషీటర్లు ఉన్నట్లు గుర్తించారు. రౌడీ షీటర్ల ప్రవర్తనను బట్టి పోలీసులు వారిని మూడు విభాగాలుగా విభజించారు. ఎవరిపై ఎలా నిఘా ఉంచాలో పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. అయితే ఇటీవలి కాలంలో రౌడీషీటర్ల వేధింపులు ఎక్కువ కావడంతో పోలీసులు వారందరినీ పిలిపించి ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండుటెండలో రోడ్డుపై కవాతు చేయించారు. రౌడీషీటర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేశారు.

## మంత్రి భరత్‌పై చేసిన ఆరోపణలను నిరూపిస్తా : బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



**కర్నూలు, పతాకం న్యూస్:** మంత్రి టిజి భరత్‌పై రాజకీయ యుద్ధానికి తాను సిద్ధంగా ఉన్నానని వైసిపి యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అన్నారు. కర్నూలులోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెలలో సతీష్ అనే యువకుడు టిడిపి నాయకుల వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని ఈనెల 14న నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టిజి భరత్‌పై తాను చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తానని అన్నారు. టిజి.భరత్ రూ.45 కోట్లు లంచంగా తీసుకున్నారనేది నిజమని, టిడిపికి చెందిన గల్లీ లీడర్ల నుండి ఎమ్మెల్యేలు, ఎంపిలు ప్రెస్‌మీట్‌లు పెట్టించి తనమీద తప్పుడు ఆరోపణలు చేయించారని వాపోయారు. తన మీద ప్రెస్‌మీట్ పెట్టే బదులు బాధిత సతీష్ కుటుంబానికి న్యాయం చేస్తే టిజి.భరత్‌కు విలువ పెరిగేదన్నారు. విలేకరుల సమావేశంలో నందికొట్కూర్ 2024 వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ పాల్గొన్నారు.

## జిజిహెచ్, ఆర్‌ఎంసి సెక్యూరిటీ గార్డ్స్ రిలే నిరాహార దీక్షలు

**కాకినాడ, పతాకం న్యూస్:** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ సేవలందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు పెంచాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అక్రమంగా విధులకు దూరం చేసిన గార్డ్స్ ని డ్యూటీలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ .... సిఐటియు ఆధ్వర్యంలో జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద మార్చి 25 న ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు 55వ రోజైన కూడా నిర్వహించారు. సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ .... జిజిహెచ్ ఆర్‌ఎంసి లలో సెక్యూరిటీ సేవల కాంట్రాక్టు ప్రారంభమై ఏడాది కావస్తున్నా సెక్యూరిటీ గార్డ్స్ జీతం కేవలం 12,099 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 13,960 రూపాయలు చెల్లించాలన్నారు.

# నిలువు దోపిడీ గురవుతున్న 'పొగాకు రైతులు'



- **నిత్యం సగానికి పైగా బేళ్లు తిరస్కరణ**
- **రోజురోజుకూ దిగజారిపోతున్న సగటు ధరలు**
- **వేలంలో కనిపించని పోటీ**
- **వ్యాపారుల సిండికేట్**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతుల వినతి**

**ఒంగోలు, పతాకం న్యూస్:** పొగాకు రైతులు నిలువునా దోపిడీకి గురవుతున్నారు. పొగ తాగడం తగ్గిస్తారనే పేరుతో పొగాకు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల భారీగా పన్నులు పెంచేసింది. ఫలితంగా సిగరెట్ల ధరలు భారీగా పెరిగాయి. కేంద్రం పొగాకు ఉత్పత్తులపై వ్యతిరేకంగా ఉందనే సాకుతో వ్యాపారులూ కొత్త ఎత్తులు వేస్తున్నారు. పొగాకు కొనుగోళ్లలో మాంద్యం సృష్టించారు. ధరలు లేవు. రోజురోజుకు వేలం తీరు ఆందోళనగా మారింది . రైతులు వేలం బహిష్కరించి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈసారి వ్యాపారులు కొత్త పన్నాగం పన్నారు. మద్దతు ధరలు అడగకుండా ఉండటానికి తిరస్కరణను మార్గంగా ఎంచుకున్నారు. నిత్యం వేలంలో సగానికి పైగా బేళ్లను తిరస్కరిస్తూ కొనుగోళ్లలో సంక్షోభానికి తెరలేపారు. రైతులు ఇప్పుడు ధరలు అడిగే పరిస్థితి కనిపించడం లేదు. కేంద్రాలకు తెచ్చిన బేళ్లను కొంటే చాలనే భావనకు వచ్చేశారు. వ్యాపారులు ఐటిసి నేతృత్వంలో కేంద్రాల్లో సిండికేట్ అయ్యి సీలింగు ధరలు అమలు చేస్తున్నారు. వేలం ప్రారంభం నుంచీ గరిష్ట ధర కిలోకు రూ.250 మాత్రమే ఇస్తున్నారు. ఒక్క రూపాయి కూడా పెంచలేదు. గతేడాది కిలో రూ.300 దాటింది. గతేడాది ధరలు కూడా ఇప్పుడు లేవు. ఇప్పుడు అన్నిటికంటే ఆందోళన చెందాల్సిన విషయమేమిటంటే రోజూ సగానికిపైగా బేళ్లను తిరస్కరిస్తున్నారు. వీటిని మళ్లీ కేంద్రాలకు తెచ్చి నెల రోజుల తర్వాతైనా అమ్ముకోవాల్సిందే. అప్పటి వరకూ వీటిని మళ్లీ జాగ్రత్తగా నిల్వ చేయాలి. అంటే, మళ్లీ కేంద్రానికి తెచ్చే లోపు నాణ్యత తగ్గుతుంది. ఇప్పుడున్న ధరలు కూడా రావు. రైతులు మరింత నష్టపోతారు. అందుకే ఎంతోకొంత ధరలకు వ్యాపారులు ఇప్పుడే కొంటే బాగుంటుందనుకునే పరిస్థితిలో రైతులు ఉన్నారు. వేలం ఇష్టారాజ్యంగా సాగుతోంది. పొగాకు బోర్డు ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ధరలు పెంచేలా వ్యాపారులతో సంప్రదింపులు లేవు. పొగాకు రైతులతో వేసిన కమిటీల ప్రతినిధులు మాట్లాడే పరిస్థితి లేదు. రైతు సంఘాల నేతలు కేంద్రాల్లోకి వెళ్లి ధరలపై ప్రశ్నిస్తున్నారు. దీన్ని నివారించేందుకు వ్యాపారులు కొత్త ఎత్తులు వేశారు. వేలంపై ఏం మాట్లాడాలన్నా కమిటీలదే బాధ్యత అని వ్యూహాత్మకంగా రైతులను ఇరికించారు. దీంతో, దోపిడీని ప్రశ్నించే పరిస్థితి లేకుండాపోయింది. వాళ్ల పొగాకు బేళ్లు అమ్ముకుంటే చాలనుకుంటున్నారు. వ్యాపారుల మోసాలకు బోర్డు అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా, వ్యాపారులు బయట కొనుగోళ్లకు తెరలేపారు. కంపెనీలు వేలంలో కొంటే ఎక్కువ ధరలు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి పొగాకు కొనుగోలు చేస్తున్నారు. వాటినే కేంద్రాలకు తేవాలని సూచిస్తున్నారు. ఈ విధానం వల్ల వేలం పద్ధతి నిర్వీర్యమవుతోంది. సుబాబుల్ కొన్నేళ్లు మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు జరిగింది. దాన్ని నిర్వీర్యం చేశారు. ఇప్పుడు ఆ పద్ధతే లేకుండాపోయింది. ధరలు దిగజారిపోయాయి. సుబాబుల్ రైతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పుడు పొగాకు రైతులనూ ఇదే దారికి లాగుతున్నారు. శనివారం నాటి కొనుగోళ్లను పరిశీలిస్తే... తేలిక నేలల్లోని కేంద్రాల్లో 32.74 శాతం బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. పొదిలి -1 కేంద్రానికి 39 బేళ్లు రాగా, కేవలం 12 బేళ్లనే కొన్నారు. దీంతో రైతులు వేలం బహిష్కరించారు. కందుకూరు-2 కేంద్రానికి 116 బేళ్లు రాగా, 38 బేళ్లను మాత్రమే కొన్నారు. మిగతా వాటిని ఇంటికి పంపారు. కేంద్రాల్లో ఇప్పటి వరకూ 37.44 లక్షల కిలోల పొగాకు కొన్నారు. సగటు ధర రూ.235.52, గరిష్ట ధర రూ.250 ఉంది. నల్లరేగడి నేల ప్రాంతాల కేంద్రాల్లో 40.60 శాతం బేళ్లను తిరస్కరించారు. వెల్లంపల్లి కేంద్రంలో 159 బేళ్లను పెట్టగా, కేవలం 76 బేళ్లనే కొన్నారు. మంత్రి స్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి కేంద్రంలో 402 బేళ్లను కొనుగోలుకు పెట్టగా, 204 బేళ్లను కొని మిగతా వాటిని తిరస్కరించారు. ఈ కేంద్రాలకు శనివారం 1,500 బేళ్లు రాగా, 891 బేళ్లను కొనుగోలు చేశారు. శనివారం సగటు ధర రూ.216.99 ఉంది. ఇప్పటి వరకూ 24.16 లక్షల కిలోల పొగాకు కొన్నారు. దీని సగటు ధర రూ.229.80 ఉంది. సగటు ధరలు పడిపోయేలా కొనుగోళ్లు నడుస్తున్నాయి.

సగటు ధర ఎంత వస్తుందనే దానిపైనే రైతులకు లాభమా? నష్టమా? అనేది తేలనుంది. పోటీ అనే మాటే లేదు. వ్యాపారులపై ఒత్తిళ్లు లేవు. ఇటీవల టంగుటూరులోని వేలం కేంద్రాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆ పార్టీ జిల్లా నేతలతో కలిసి సందర్శించారు. వేలం జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలకు నిధులు కేటాయించి వేలంలో కొనుగోళ్లు చేట్టాలని సూచించారు. వైసిపి నేతలూ సందర్శిస్తున్నారు. వేలం తీరుపై ప్రభుత్వాలను నిలదీస్తున్నారు. అయితే, ఇంతవరకూ మంత్రులుగానీ, పాలకపక్ష ఎమ్మెల్యేలుగానీ వేలం కేంద్రాలను సందర్శించిన దాఖలాల్లేవు. పొగాకు రైతులను పూర్తిగా వదిలేశారు. ఇప్పుడున్న సంక్షోభాల్లో ఇదొకటి అన్నట్టుగా వారు ఉన్నారు. తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

# 20న సచివాలయాల ముట్టడి: వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు



**అమరావతి, పతాకం న్యూస్:** ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలి- ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలను ముట్టడించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె లోకనాథం మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేస్ యాప్ వల్ల ఉపాధి హామీ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల ఇళ్లు, భూముల్ని బలవంతంగా దోచుకుంటుందని విమర్శించారు. అభివృద్ధి మాటున ల్యాండ్ పూలింగ్ పేరుతో లక్షల ఎకరాలను తీసుకుంటోందని, ఇప్పటికే 5 లక్షల ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక చట్టాలను అమలు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ నెరవేర్చలేదన్నారు. వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలు చేస్తామన్న హామీలను విస్మరించిందన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డి రమాదేవి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఉపాధి హామీ పనుల్లో 100కు 62 శాతం పనిచేసేది మహిళలేనన్నారు. కార్మికులకు రోజుకు రూ.200 కన్నా ఎక్కువ ఇవ్వటం లేదన్నారు. కొన్ని ప్రదేశాల్లో కార్మికుల దగ్గర అధికారులు లంచాలు తీసుకుంటున్నారన్నారు. ఫేస్ యాప్ ద్వారా అనేక మంది అక్రమంగా డబ్బులు దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 125 రోజుల పనిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్యం, గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, తక్షణమే వాటిని అరికట్టాలని కోరారు. కోశాధికారి కె ఆంజనేయులు మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు లేనప్పుడు కార్మికులకు ఉపాధి హామీ పనులే వారికి ప్రధానం అని తెలిపారు. ప్రతియేటా జిల్లాల్లో కనీసం 2 లక్షల మంది పనిచేస్తూ ఉండేవారన్నారు. కానీ ఈ సంవత్సరం ప్రతి జిల్లాలో ఆ సంఖ్య లక్షకు పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ 6 అని పెట్టి వ్యవసాయ కార్మికులకు ఒక్కటి కూడా అమలు చేయలేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు విమర్శించారు. పిల్లల్ని కనండని పిలుపునిస్తున్న ప్రభుత్వం పుట్టిన ప్రతి బిడ్డకు రూ.20 లక్షలు డిపాజిట్ చేసి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని సూచించారు. ఉండి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 15 గ్రామాల్లో 1,500 ఇళ్లు కూల్చేశారని, బోడ్డాడ, జక్కరం, ఏలూరుపాడు, జువ్వలపాలెం, ఉండి, ఉన్నద్దరు, పాలమర్రు, ఉణ్ణదర్రులో ఇళ్లు కూల్చిన తరువాత స్కూల్ సైకిల్ షెడ్ లో భోజనం చేస్తున్న బాధిత కుటుంబాలను రఘురామ కృష్ణరాజు స్కూల్ హెడ్ మాస్టర్ పై ఒత్తిడి తీసుకొచ్చి వారిని బలవంతంగా ఖాళీ చేయించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఈ నెల 26న విజయవాడలో రౌండ్ టేబుల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## పెంచిన పెట్రో ధరలను తగ్గించాలని నిరసన

**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రామలక్ష్మణ జంక్షన్, పాతబస్టాండ్ వద్ద వేర్వేరుగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యుద్ధం నెపంతో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే గ్యాస్ ధరలు పెంచడంతో చిరు వ్యాపారులు సిలిండర్లు లభ్యం కాక వ్యాపారాలను కోల్పోయారని, ప్రస్తుతం పెట్రో ధరలు పెంచి మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఫలితాల తరువాత ఈ విధంగా ధరలు పెంచి మోసం చేశారని విమర్శించారు. కార్యక్ర మంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్, సీపీఐ నాయకులు ఆర్.అరవింద్, కూన వసంత్, కె.తులసీరావు, అప్పన్న, చిన్నబాబు, లబ్బ రాజు, జి.రమణ మూర్తి, బమ్మిడి రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదంలో 12 మంది దుర్మరణం



**మహారాష్ట్ర, పతాకం న్యూస్:** మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై పెళ్ళి బృందంతో వెళుతున్న ట్రక్కును కంటైనర్ బలంగా ఢీకొట్టడంతో 12 మంది మృతి చెందగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వారితో వెళుతున్న ట్రక్కును పశువులతో వెళుతున్న కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదం జరిగినప్పుడు ట్రక్కులో 100 మందికి పైగా ఉన్నట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదంలో పదుల సంఖ్యలో గాయపడటంతో పెద్ద ఎత్తున అంబులెన్సులను మోహరించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత వహించాలి



**పాతపట్నం, పతాకం న్యూస్:** ప్లాస్టిక్ రహిత సామాజంకోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత వహించా లని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. స్థానిక ఆలాంధ్రరోడ్‌లోని చెత్త నుంచి సందప తయారీకేంద్రంలో ఘన వ్యర్థాల నిర్వహణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌తో పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. పర్యావరణానికి ముప్పుగామారిన ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకై ప్రభుత్వం ముందుడుగు వేసిందన్నారు. ఇందులో భాగంగా శాస్త్రీయ పద్ధతిలో ఈ ఆధునిక యంత్రాలను వినియోగించి ప్లాస్టిక్ వ్యర్థాలను సులభతరంగా వేరుచేసి రీసైక్లింగ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. దీనిద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు పంచాయతీలకు అదనపు ఆదాయం లభించనుందన్నారు. నియోజకవర్గాన్ని పచ్చదనం- పరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేలా ప్రజా భాగస్వామ్యంతో పనిచేసేందుకు నాయకులు, అధికారులు సమన్వ యంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి టీడీపీ నేతలు పైల బాబ్జీ, సైలాడ సతీష్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ
## స్వచ్ఛమైన నీరు: నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా రూ.14,000 కోట్లతో అమృత్ పథకం కింద పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీ జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరులోని 54వ డివిజన్‌లో 350 కిలోలీటర్ల సామర్థ్యం గల మంచి నీటి ట్యాంకు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలన విద్యాభివృద్ధితోనే సాధ్యమన్నారు. పి4 విధానం ద్వారా పేదలకు అండగా ఉంటానని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో ఆరు నుంచి పదవ తరగతి చదువుతున్న మొత్తం 8,400 మంది విద్యార్థులలో 7,000 మంది విద్యార్థులకు తన సొంత నిధులతో త్వరలోనే ఉచితంగా 'హీరో' సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. నగరంలోని మూలాపేట, ఆర్ఎస్ఆర్ స్కూల్స్ వంటి ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దే బాధ్యతలను తన కుమార్తె శరణి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అనంతరం 14వ డివిజన్ ఎసి నగర్ మల్లెల సంజీవయ్య స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. పాఠశాలల అభివృద్ధికి సహకరించిన ప్రతి దాతకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పదోతరగతిలో 580 మార్కులు సాధించిన మల్లెల సంజీవయ్య స్కూల్ విద్యార్థినులను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఇ మోహన్,అడిషనల్ కమీషనర్ హిమబిందు, మేయర్ సుజాతా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నీలం సంజీవరెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు

**వేంపల్లె, పతాకం న్యూస్:** మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి 113వ జయంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి అసలు సిసలైన స్వాతంత్ర సమరయోధుడని చెప్పారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్ని 4 సంవత్సరాల పాటు దుర్భర జైలు జీవితాన్ని గడిపినట్లు తెలిపారు. సంజీవరెడ్డి గొప్ప పరిపాలనా దక్షుడు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా,ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్ , రాష్ట్రపతిగా అనేక పదవులు అలంకరించినట్లు చెప్పారు.

### అమరావతి రైతులకు
## అన్యాయం చేస్తే ఊరుకోం: పేర్ని నాని





**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతి నగరంలో భూములిచ్చిన రైతులకు అన్యాయం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి పేర్ని వెంక్రటామయ్య (నాని) తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో భారీ అవినీతి జరుగుతోందని, దీన్ని ప్రశ్నిస్తే చూస్తూ తట్టుకోలేకపోతున్నారని అన్నారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో ప్రజా సంపద లూటీ చేస్తున్నారని, రాజధాని నిర్మాణాల్లో కొత్తగా జరుగుతున్న అద్భుతాలు లేవని పేర్కొన్నారు. 2019కి ముందు పూర్తయిన వాటికే రంగులేసి చూపుతున్నారని, అమరావతి నుంచి రోజూ వెయ్యి టిప్పర్ల నల్ల మట్టిని బయటకు తరలిస్తున్నారని అన్నారు. సిఎం చంద్రబాబు మౌఖిక ఆదేశాలతోనే టిడిపి ఎమ్మెల్యేల మట్టి వ్యాపారం జరుగుతోందన్నారు. భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఎప్పుడిస్తారో చెప్పాలన్నారు. లేఅవుట్‌లలో పనులు ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. వైసిపి సోషల్ మీడియా దెబ్బకు ఈ ప్రభుత్వం గజగజ వణికిపోతోందని తెలిపారు. అమరావతిపై తనతో సహా వైసిపి నాయకుల ఆరోపణలు తప్పయితే రుజువు చేయాలని, అంతేకానీ పోలీసుల ద్వారా వీడియోలను డిలీట్ చేయించడానికి మెటా, ఎక్స్‌కు నోటీసులు పంపించడం సరికాదన్నారు. అమరావతిలో రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులోనూ భారీ స్కాం జరుగుతోందని, అనుకూలంగా ఉండేవారికి ఒకలా, సాధారణ రైతులకు మరోలా ప్లాట్లు కేటాయిస్తున్నారని నాని ఆరోపించారు.

## కాశీలో డొక్కా సీతమ్మ ఆశ్రమం..

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కాశీ వెళ్లే తెలుగు భక్తులకు గొప్ప శుభవార్త ఇది. వారణాసిలో "డొక్కా సీతమ్మ ఆశ్రమం" ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే భక్తులకు తక్కువ ధరకే గదులు, భోజనం పూర్తిగా ఉచితం అందించనున్నారు. ఆంధ్రుల అన్నపూర్ణ స్ఫూర్తితో దండు త్రినాథరాజు ఏర్పాటు చేసిన ఈ ఆశ్రమం గంగానది సమీపంలోని హనుమాన్ ఘాట్ వద్ద అందుబాటులో ఉంది. దండు త్రినాథరాజు సేవా భావానికి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ ఆశ్రమంలో తక్కువ అద్దెతో గదులు లభిస్తాయని, ఉచిత భోజనం అందిస్తామని, తెలుగు వారికి తొలి ప్రాధాన్యం కల్పిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు.

# కిడ్నీ వ్యాధులు ఉన్న వారు ఏ పండ్లను తినాలి.. వేటిని తినకూడదు..?

కిడ్నీ వ్యాధులు ఉన్న వారు ఏ పండ్లను తినాలి.. వేటిని తినకూడదు..? కిడ్నీ సమస్యలతో బాధపడే వారు ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్త వహించడం చాలా అవసరం. అయితే ఆహారంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది అనేక పదార్థాలకు దూరంగా ఉంటున్నారు. ఇలా దూరంగా ఉంచే వాటిల్లో పండ్లు కూడా ఒకటి. కానీ కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు పండ్లు పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. కిడ్నీ సమస్యలతో బాధపడే వారు ఆహారం తీసుకునే విష యంలో జాగ్రత్త వహించడం చాలా అవసరం. అయితే ఆహారంపై అవగాహన లేకపోవడంతో చాలా మంది అనేక పదార్థాలకు దూరంగా ఉంటున్నారు. ఇలా దూరంగా ఉంచే వాటిల్లో పండ్లు కూడా ఒకటి. కానీ కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు పండ్లు పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే ఏ పండ్లు ఎంత మోతాదులో తీసుకోవాలి అన్న విష యంలో జాగ్రత్త అవసరమని సూచిస్తున్నారు. ముఖ్యంగా శరీరంలో పొటాషియం స్థాయిలు, కిడ్నీ పనితీరు ఆధారంగా పండ్ల ఎంపిక ఉండాలి. సరైన పండ్లను మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. తప్పుగా ఎంపిక చేసుకుంటే హైపర్‌కలేమియా వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది.



క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రారంభ దశల్లో కిడ్నీలు సాధారణంగా పనిచేస్తుండటంతో ఎక్కువ రకాల పండ్లను మితంగా తీసుకోవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం పండ్లు, కూరగాయలు కిడ్నీ రోగుల్లో మూత్రంలో ఆల్బుమిన్ స్థాయులను తగ్గించడంలో సహాయ పడతాయి. దీంతో కిడ్నీ నష్టం వేగం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే కిడ్నీ పనితీరు తగ్గే కొద్దీ పొటాషియం నియంత్రణ చాలా ముఖ్యమవుతుంది. స్టేజ్ 3, స్టేజ్ 4 కిడ్నీ వ్యాధుల్లో అధిక పొటాషియం ఉన్న పండ్లను పరిమితం చేయాలి. అరటి, మామిడి, నారింజ వంటి పండ్లలో పొటాషియం ఎక్కువగా ఉండటంతో వాటిని తగ్గించడం మంచిది. ఆపిల్, పైనాపిల్, జామ వంటి పండ్లు తక్కువ పొటాషియం కలిగి ఉండటంతో మితంగా తీసుకోవచ్చు. కిడ్నీ వ్యాధి తీవ్రమైన దశకు చేరినప్పుడు లేదా డయాలసిస్ తీసుకుంటున్నప్పుడు ఆహార నియంత్రణ మరింత అవసరమవుతుంది. ఈ దశలో యాపిల్, బొప్పాయి, బెర్రీలు వంటి తక్కువ పొటాషియం ఉన్న పండ్లను మాత్రమే పరిమిత మోతాదులో తీసుకోవాలి. సాధారణంగా రోజుకు 100 గ్రాముల వరకు మాత్రమే పండ్లు తీసుకోవడం మంచిది.

అలాగే పండ్లరసాల విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం. ఫ్రూట్ జ్యూసుల్లో పొటాషియం, చక్కెర మోతాదులు అధికంగా ఉండే అవకాశం ఉండటంతో వాటిని అధికంగా తీసుకోవడం మంచిది కాదు. తక్కువ పొటాషియం ఉన్న పండ్లను తీసుకున్నా మోతాదు ఎక్కువైతే సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే పండ్లను కొలిచి తీసుకోవడం, ఒకేసారి అధికంగా తినకపోవడం అవసరం.

మొత్తం ఆహారంలో పండ్ల మోతాదు సమతుల్యంగా ఉండేలా చూసుకోవాలి. కిడ్నీ రోగులకు పండ్ల ఎంపిక ఇతర ఆరోగ్య పరిస్థితులపై కూడా ఆధారపడి ఉంటుంది. మధుమేహం ఉన్నవారు చక్కెర స్థాయిలను దృష్టిలో ఉంచుకోవాలి. అలాగే శరీరంలో ద్రవాల సమతుల్యత, రక్తంలోని పొటాషి యం స్థాయిలను కూడా పరిశీలించి ఆహారం నిర్ణయించుకోవాలి.

పండ్లు ఆరోగ్యకరమైనవే కాబట్టి ఎంతైనా తినొచ్చని భావించడం తప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్యాకెట్ జ్యూసులు లేదా తాజా ఫ్రూట్ జ్యూసులను అధికంగా తీసుకోవడం ప్రమాదకరమ వుతుంది. వైద్యులు సూచించిన డైట్ నియమాలను తప్పకుండా పాటించాలి. కిడ్నీ వ్యాధి ఉందంటే పండ్లను పూర్తిగా మానే యాల్సిన అవసరం లేదు. సరైన ఎంపికతో మితంగా తీసుకుంటే అవి పోషకాహారంలో భాగంగా కొనసాగవచ్చు. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, పరీక్షల ఫలితాల ఆధారంగా ఆహారాన్ని సర్దుబాటు చేసుకోవడం అత్యంత ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# పెద్దాసుపత్రిలో సౌకర్యాలు కరువు!

## ఇరుకు గదుల్లో ఇన్‌పేషెంట్లకు వైద్యసేవలు.. స్కానింగ్‌లకు తప్పని ఇక్కట్లు




**పార్వతీపురం, పతాకం న్యూస్:** పేరుకే పెద్దాసుపత్రి.. కానీ ఆ స్థాయిలో వైద్య సిబ్బంది లేరు. సౌకర్యాలు అంతంతమాత్రమే. వసతి సమస్య కూడా తీవ్రంగా వేధిస్తోంది. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నాళ్లుగా పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో ఈ పరిస్థితి నెలకొన్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. వాస్తవంగా జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున రోగులకు ఇక్కడకి వస్తుంటారు. ముఖ్యంగా గిరిజనులు వైద్య చిక్సితలకు తరలివస్తుంటారు. మరోవైపు సరిహద్దు ఒడిశా వాసులు కూడా జిల్లా కేంద్రాసుపత్రినే ఆశ్రయిస్తారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఆసుపత్రిలో రోగుల సంఖ్యకు తగ్గట్టుగా వైద్య సిబ్బందిని పెంచడం లేదు. మరోవైపు అదనపు గదులు లేక ఇన్‌పేషెంట్లకు ఇక్కట్లు తప్పడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో వంద పడకలతో ఉన్న పార్వతీపురం ఆసుపత్రిని వైసీపీ సర్కారు 150 పడకలతో అప్‌గ్రేడ్ చేసింది. అయితే ఆ స్థాయిలో భవన నిర్మాణాలు చేపట్టలేదు. వైద్య సిబ్బందిని కూడా నియమించలేదు. ప్రధానంగా స్టాఫ్ నర్సులతో పాటు రేడియాలజిస్ట్ తదితర పోస్టులను భర్తీ చేయలేదు.

జిల్లా కేంద్రాసుపత్రిలో అదనపు భవనాల నిర్మాణం కొలిక్కి రావడం లేదు. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆసుపత్రిలో సుమారు 250 మందికి మించి ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. అయితే ఇరుకైన గదుల్లోనే బెడ్లు ఏర్పాటు చేస్తుండడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇన్‌పేషెంట్ల సంఖ్య మరింత పెరిగితే రోగుల సహాయకులు ఆసుపత్రి ప్రాంగణం బయటే ఉండాల్సి వస్తోంది. సీజనల్ వ్యాధులు విజృంభించే సమయంలో అటు రోగులు, ఇటు వైద్య సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు.

150 పడకల ఆసుపత్రికి 35 మంది స్టాఫ్ నర్సులు ఉండాలి. కానీ 32 మంది మాత్రమే ఉన్నారు. మరో 20 మంది స్టాఫ్‌నర్సులను ఇక్కడ నియమించాల్సి ఉంది. అయితే పూర్తిస్థాయి సిబ్బంది లేక ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. పెద్దాసుపత్రిలో రేడియాలజిస్ట్ పోస్టు కూడా కొన్నాళ్లుగా ఖాళీగానే ఉంది. గర్భిణులకు ఇబ్బంది లేకుండా ఒక్కోసారి మహిళా వైద్య నిపుణులే ఆ బాధ్యతలు చేపట్టాల్సి వస్తోంది. మూడేళ్లుగా రోగులకు వైద్య పరీక్షలతో పాటు స్కానింగ్ పనులను కూడా మహిళా వైద్యులే చూసుకోవాల్సి వస్తోంది.

జిల్లా కేంద్రాసుపత్రిలో ఐసీయూ ఉన్నా.. ఏ లాభం లేదు. ఆ విభాగంలో పనిచేసేందుకు ప్రత్యేకంగా వైద్యులు, వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్సులను నియమించలేదు. దీంతో అత్యవసర వేళల్లో రోగులకు ఐసీయూ సేవలు అందడం లేదు. ఉరుకుల పరుగులతో పొరుగు జిల్లాకు చేరుకోవాల్సి వస్తోంది.

డయాలసిస్ కేంద్రంతో పాటు పసిపిల్లలకు అవసరమైన నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ వంటివి జిల్లా కేంద్రాసుపత్రిలో ఉన్నాయి. అయితే పూర్తిస్థాయిలో మౌలిక వసతులతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది, స్టాఫ్‌నర్సులను నియమించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

# హర్మూజ్ నిర్వహణకు కొత్త సంస్థ: ఇరాన్



**ఇరాన్:** అంతర్జాతీయ రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి నిర్వహణకు గానూ కొత్త సంస్థను ఏర్పాటు చేసినట్లు ఇరాన్ సోమవారం ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయిల్ దాడి తరువాత ఆ మార్గం గుండా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. అనంతర పరిణామాల్లో ఆ మార్గం గుండా ప్రయాణం చేసే నౌకల నుండి టోల్ వసూలు చేయాలని ఇరాన్ నిర్ణయించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి తన అధికార ఎక్స్ ఖాతాలో జలసంధిలో నౌకల రాకపోకలను పర్యవేక్షించేందుకు కొత్త సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ పోస్టును పర్షియన్ గల్ఫ్ జలసంధి అథారిటీ (పిజిఎస్‌ఎ)తో పంచుకుంది. రివల్యూషనరీ గార్డ్స్ నావికాదళం కూడా ఈ పోస్టును పంచుకుంది. యుద్ధాన్ని ముగించడానికి ఉద్దేశించి అమెరికా చేసిన కొత్త ప్రతిపాదనపై తాము స్పందించామని అంతకుముందు ఇరాన్ తెలిపింది. వాషింగ్టన్ డిమాండ్లు అతిగా వున్నాయని ఇరాన్ మీడియా వ్యాఖ్యానించింది. అయినప్పటికీ ఇరు దేశాల మధ్య సందేశాలు, పరస్పర మార్పిడులు కొనసాగుతున్నాయని తెలిపింది. తమ ఆందోళనలను అమెరికాకు తెలియచేశామని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాగ్చి పత్రికా సమావేశంలో తెలిపారు. పాకిస్తానీ మధ్యవర్తి ద్వారా సందేశాల మార్పిడి సాగుతోందని చెప్పారుఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు కొనసాగిస్తోంది. దీంతో ఉత్తర ఇజ్రాయిల్‌లో మిలటరీ లక్ష్యంపై డ్రోన్‌తో దాడి చేసినట్లు హిజ్బుల్లా సోమవారం ప్రకటించింది. 'తుపాను ముందు ప్రశాంతత' అంటూ ఎఐలో రూపొందించిన ఫోటోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇరాన్‌పై వైమానిక దాడులను తిరిగి ప్రారంభించే అవకాశం ఉందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన పెట్టిన ఈ ఫోటో పెట్టడం గమనార్హం. ఆ ఫొటోలో అల్లకల్లోలంగా ఉన్న సముద్రంలో యుద్ధనౌకలు ప్రయాణిస్తుండగా, ట్రంప్, ఆయన పక్కన ఒక యూఎస్ నేవీ అడ్మిరల్ నిలబడి ఉన్నట్టు ఉంది. ట్రంప్ మేక్ అమెరికా గ్రేట్ అగైన్ టోపిని పెట్టుకుని ఉండగా, సముద్రంలో ఉన్న నౌకలపై ఇరాన్ జెండాలు ఉండటం గమనార్హం. దీనికి 'తుపానకు ముందు ప్రశాంతంగానే ఉంటుంది' అని ట్రంప్ క్యాప్షన్ పెట్టారు. దీంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు మొదలయ్యే అవకాశం వుందనే ఆందోళనలు తలెత్తాయి.




# అఫ్గానిస్థాన్‌తో సిరీస్.. భారత వన్డే, టెస్టు జట్ల ప్రకటన



అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు వచ్చే నెలలో భారత పర్యటనకు రానుంది. ఈ నేపథ్యంలో టీమిండియా అఫ్గాన్‌తో ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఇందుకోసం బీసీసీఐ భారత వన్డే, టెస్టు జట్లను ప్రకటించింది. టెస్టు, వన్డే జట్లకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. కొన్ని నెలలుగా తీరిక లేకుండా క్రికెట్ ఆడుతున్న స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ విశ్రాంతినిచ్చింది. గత కొంత కాలంగా ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్న స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు వన్డేల్లో అవకాశం దక్కలేదు. వెటరన్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నారు. అయితే ఐపీఎల్ సందర్భంగా గాయపడ్డ రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యకు జట్టులో చోటిచ్చారు. కానీ మ్యాచ్ సమయానికి ఫిట్‌నెస్ ఆధారంగానే తుది జట్టులో ఉండాలో? లేదో? నిర్ణయిస్తామని బీసీసీఐ తెలిపింది. మరోవైపు ఐపీఎల్ 2026లో సత్తా చాటుతున్న యువ ప్లేయర్లకు కూడా బీసీసీఐ జట్టులో అవకాశం ఇచ్చింది.

**భారత వన్డే జట్టు:** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్య, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబె, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, గుర్‌నూర్ బ్రార్

**భారత టెస్ట్ జట్టు:** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), రిషబ్ పంత్(వికెట్ కీపర్), సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, హర్ష్ దూబె, బ్రార్

## పొగమంచు కారణంతో

# సాగని భారత్-దక్షిణాఫ్రికా నాలుగో టీ20



ఇషాన్ కిషన్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) అద్భుత ఆటతీరుతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ ప్లేఆఫ్‌లో అడుగుపెట్టింది. అటు తమ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తేలిపోయింది. చెపాక్‌లో చివరి మ్యాచ్ ఆడిన చెన్నై చివరి వరకు పోరాడినా 5 వికెట్ల తేడాతో ఓడింది. అయితే చెన్నైన 12 పాయింట్లతో ఇప్పటికీ అధికారికంగా రేసులోనే ఉన్నా తమ ఆఖరి మ్యాచ్‌లో గుజరాత్‌పై గెలిచి.. పోటీగా ఉన్న పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ ఓడాల్సి ఉంటుంది. మరోవైపు ఈ ఫలితంతో.. రైజర్స్‌తో పాటు 16 పాయింట్లతో ఉన్న గుజరాత్ కూడా ప్లేఆఫ్స్‌లో ప్రవేశించడం విశేషం. మరే జట్టుకు ఇన్ని పాయింట్లు వచ్చే చాన్స్ లేకపోవడమే ఇందుకు కారణం. ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లకు 180 పరుగులు చేసింది. బ్రెవిస్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 44), కార్తీక్ శర్మ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), సంజూ శాంసన్ (13 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) రాణించారు. కమిన్స్‌కు 3, సకీబ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 19 ఓవర్లలో 181/5 స్కోరు చేసి గెలిచింది. క్లాసెన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47) కీలకంగా నిలిచాడు. ముకేశ్‌కు 2 వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఇషాన్ నిలిచాడు. కఠిన పిచ్‌పై ఛేదనకు బరిలోకి దిగిన సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ నిదానంగానే ఆరంభించింది. మధ్య ఓవర్లలో అండగా నిలిచిన ఇషాన్ దాదాపు చివరి వరకు నిలిచి చెన్నైకి చెక్ పెట్టాడు. అతడికి క్లాసెన్ సహకరించాడు. ఓపెనర్ హెడ్ (6) మూడో ఓవర్‌లో వెనుదిరగ్గా.. స్పిన్నర్లు అకీల్, నూర్ కట్టడి చేయడంతో అభిషేక్ (21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 26) కూడా భారీ షాట్లు ఆడలేకపోయాడు. దీంతో పవర్‌ప్లేలో ఎస్ఆర్‌హెచ్ 45 రన్స్‌కే పరిమితమైంది. ఆ తర్వాత 8వ ఓవర్‌లో అభిషేక్‌ను అకీల్ అవుట్ చేయడంతో చెన్నైకి పట్టు చిక్కినట్టయ్యింది. అటు క్రీజులో ఉన్న ఇషాన్-క్లాసెన్ కూడా వికెట్ పడకుండా ఆచితూచి ఆడాల్సి వచ్చింది. దీంతో తొలి 10 ఓవర్లలో రైజర్స్ 75 రన్సే చేసింది. కానీ, ఆ తర్వాత క్లాసెన్ చెలరేగాడు. దీనికితోడు 11వ ఓవర్‌లో అతడి క్యాచ్‌ను జాన్సన్ వదిలేయడం చెన్నైని దెబ్బతీసింది. అదే ఓవర్‌లో క్లాసెన్ 6,4 బాదాడు. ఇషాన్ కూడా బౌండరీలు రాబట్టడంతో మ్యాచ్ రైజర్స్ వైపు మొగ్గుచూపింది. 15వ ఓవర్‌లో శాంసన్ మెరుపు స్టంపింగ్‌తో క్లాసెన్ వెనుదిరగడంతో మూడో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే నితీశ్ (11) అవుటైనా.. రన్‌రేట్ అదుపులోనే ఉండడంతో రైజర్స్‌కు ఇబ్బంది ఎదురుకాలేదు.

ఇక 12 బంతుల్లో 13 రన్స్ కావాల్సిన వేళ.. 19వ ఓవర్‌లో ఇషాన్ అవుటైనా సలీల్ (10 నాటౌట్) సిక్సర్, స్మరణ్ (5 నాటౌట్) ఫోర్‌తో మ్యాచ్ ముగిసింది. టాస్ గెలిచిన చెన్నై ప్రత్యర్థి ముందు భారీ స్కోరును ఉంచాలనే ఆలోచనతో బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ పిచ్ నుంచి వీరికేమాత్రం సహకారం లభించలేదు. అయితే ఓపెనర్ శాంసన్, కార్తీక్, ఉర్విల్ (13), బ్రెవిస్ వేగం చూపడంతో కాస్త సవాల్ విసిరే స్కోరందుకుంది. ఇక ఓపెనర్ రుతురాజ్ (15) 12 ఓవర్లపాటు బ్యాటింగ్ సాగించినా షాట్లు ఆడేందుకు బాగా ఇబ్బందిపడ్డాడు. అయితే ఆరంభంలో శాంసన్ ధనాధన్ ఆటతో తొలి ఓవర్‌లోనే 6,4,4తో 17 రన్స్ రాబట్టాడు. అలాగే రెండో ఓవర్‌లోనూ హ్యాట్రిక్ ఫోర్లు బాదడంతో చెపాక్‌లో జోష్ కనిపించింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే పేసర్ కమిన్స్ అతడిని దెబ్బతీశాడు. అయితే ఉర్విల్ వచ్చీ రాగానే రెండు వరుస సిక్సర్లతో మురిపించాడు. అతడిని ఎక్కువ సేపు నిలువనీయకుండా పేసర్ సకీబ్ బౌల్డ్ చేయడంతో, పవర్‌ప్లేలో జట్టు 57/2 స్కోరుతో నిలిచింది.




# 'సెయాన్' సినిమా షూటింగ్ ప్రారంభం



వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్ తన తదుపరి భారీ ప్రాజెక్ట్ కోసం దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌తో చేతులు కలిపారు. 'సెయాన్' (రావఎశీఅ) అనే టైటిల్‌తో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రాన్ని యూనివర్సల్ హీరో కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న మైల్‌స్టోన్ మూవీ 'అమరన్' అఖండ విజయం తర్వాత రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌లో శివకార్తికేయన్ నటిస్తున్న తదుపరి చిత్రం ఇదే కావడం విశేషం. ఇటీవల శివకార్తికేయన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందనను రాబట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ అప్డేట్‌ను మేకర్స్ వదిలారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ షూటింగ్ అధికారికంగా ప్రారంభమైంది. ఈ విషయాన్ని మేకర్స్ ఒక ఇంటెన్స్ పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ క్లోజప్ పోస్టర్‌లో శివకార్తికేయన్ లుక్ రౌద్రంగా ఉంది. ఆయన ముఖంపై పడుతున్న మంటల వెలుతురు, కళ్లలో కనిపిస్తున్న కసి.. సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ పోస్టర్ చూస్తుంటే ఆధ్యాత్మికతతో కూడిన పక్కా మాస్ యాక్షన్ స్టోరీ ఇదని తెలుస్తోంది. రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా.. ఆడియెన్స్ అందరినీ ఆకట్టుకునే రూటెడ్ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో అలరించేలా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు

# తిలక్ వర్మతో అఫైర్ అంటూ వార్తలు... ప్రకటన విడుదల చేసిన శ్రీలీల టీమ్



ప్రముఖ నటి శ్రీలీల, యువ క్రికెటర్ తిలక్ వర్మ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారా నికి ఆమె టీమ్ ఫుల్ స్టాప్ పెట్టింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైన, అవాస్తవ కథనాలని అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలీల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది.

"శ్రీలీల, తిలక్ వర్మకు సంబంధించి వ్యాప్తి చెందుతున్న పుకార్లు పూర్తిగా నిరాధారమైనవి, అసత్యమైనవి. వారిద్దరూ ఇప్పటివరకు ఒకరినొకరు కనీసం కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు కూడా. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. వాస్తవ నిర్ధారణ లేకుండా ఇలాంటి కల్పిత కథనాలను ప్రచారం చేయవద్దని కోరుతున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడి యా ఖాతాలతో పాటు పాటు కొన్ని మీడియా వేదికల్లోనూ కథనాలు వెలువడిన నేపథ్యంలో శ్రీలీల టీమ్ ఈ వివరణ ఇచ్చింది. వ్యక్తిగత విషయాలపై వార్తలు రాసేట ప్పుడు మీడియా, సోషల్ మీడియా యూజర్లు బాధ్యతా యుతంగా వ్యవహరిం చాలని, ధృవీకరించని సమా చారాన్ని వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేసింది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై తరచూ ఇలాంటి పుకార్లు రావడం సహజమే అయినప్పటికీ, ఈ ప్రచారం ఎక్కువ కావడంతో వెంటనే స్పందించి పుకార్లకు అడ్డుకట్ట వేయాలని శ్రీలీల బృందం నిర్ణయించుకుంది. ఈ అధికారిక ప్రకటనతో శ్రీలీల, తిలక్ వర్మ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

# రామ్ చరణ్ తో తన జోడీని చిరంజీవి-శ్రీదేవి కాంబోతో పోల్చిన జాన్వీ కపూర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న నటి జాన్వీ కపూర్, ముంబైలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చరణ్‌తో తన జోడీపై ప్రేక్షకులు పెట్టుకున్న అంచనాల గురించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్ర మంలో రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాన్వీ కపూర్ మాట్లా డుతూ, "మా ఇద్దరి మధ్య ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉందని నేను అర్థం చేసుకోగ లను. గతంలో చిరంజీవి గారు, మా అమ్మ శ్రీదేవి ఆన్ స్క్రీన్ జోడీని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు మమ్మల్ని వెండితెరపై చూడాలని వారు ఆసక్తిగా ఉన్నారు. ఇంత ప్రత్యేకమైన చిత్రంలో అతడితో కలిసి పనిచేయడం ఒక అద్భుతంలా అనిపించింది. అతడు నిజంగా అత్యుత్తమ వ్యక్తి" అని తెలిపారు.

చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానాపై కూడా జాన్వీ ప్రశంసలు కురిపించారు. "మేము రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాం. బుచ్చి చూడటానికి చాలా అమాయకంగా కనిపిస్తారు, కానీ నిజా నికి ఆయన అలా కాదు. ఇండి యాలోనే ఆయన రౌడీయెస్ట్ డైరెక్టర్. నిజాయతీగా చెప్పాలంటే ఆయన నన్ను ఎన్నో విధా లుగా మార్చారు. నాకు బెస్ట్ ఫ్రెం డ్ అయ్యారు. రోజులో ఒక్క సారైనా ఆయ నకు ఫోన్ చేసి మాట్లాడా ల్సిందే" అని ఆమె వివరిం చారు.

ఈ చిత్రంలో దివ్యేందు, శివ రాజ్‌కు మార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**